# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఢిల్లీలో పర్యటిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఈరోజు 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగడియాతో సమావేశమయ్యారు.
- రాష్ట్రంలోని 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి 9 వేల 417 కోట్ల రూపాయల నిధులను కేటాయించామని కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికకు ఈరోజు నోటిఫికేషన్ విడుదల అయింది.
- బాలికల భవిష్యత్ కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు.

==========================

ఢిల్లీలో పర్యటిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగడియాతో సమావేశమై రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చించారు. గత 5 సంవత్సరాల్లో 10 లక్షల కోట్ల రూపాయలు రుణం తెచ్చారని, లక్షన్నర కోట్ల రూపాయలకు పైగా బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు వివరించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సహకరించాలని అరవింద్ పనగడియాను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కోరారు.

==========================

రాష్ట్రంలోని 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి 9 వేల 417 కోట్ల రూపాయల నిధులను కేటాయించామని కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అదేవిధంగా మరిన్ని నమో భారత్, వందే భారత్ రైళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఢిల్లీలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆధునిక సాంకేతికత సాయంతో రైల్వేల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

అనంతరం విజయవాడ రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనందరావ్ పాటిల్ పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి చర్చించామని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో ప్రాజెక్టుల పనులు వేగవంతం చేస్తున్నామని, వచ్చే నాలుగేళ్లలో రైల్వే లైన్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రానికి వందేభారత్ స్లీపర్ రైళ్లు కావాలని ప్రతిపాదనలు ఉన్నాయని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

==========================

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల కు సంబంధించి ఈరోజు నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఈరోజు నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ, 27న పోలింగ్ నిర్వహిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది. మార్చి 3న ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలోని 123 పోలింగ్ కేంద్రాల్లో 21 వేల 555 మంది ఓటర్లు తమ ఓట హక్కు వినియోగించుకోనున్నారని అధికారులు వెల్లడించారు.

==========================

తిరుపతి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎన్నికల నిబంధనల మేరకు కోరం లేనందున రేపటికి వాయిదా వేసినట్లు తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్, ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్ ప్రకటించారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ ఈరోజు ఉదయం 11 గంటల నుంచి డిప్యూటీ మేయర్ పదవికి ఎంపిక జరిగిందని.. అయితే కార్పొరేటర్లందరూ రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆయన వివరిస్తూ..

(వాయిస్ 23 సెకన్లు)

==========================

ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా సంయుక్త కలెక్టర్, ప్రిసైడింగ్ అధికారి పి.ధాత్రిరెడ్డి డిప్యూటీ మేయర్ల ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 30 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు. 2 స్థానాలకు జరిగిన ఎన్నికలలో నామినేషన్ దాఖలు చేసిన పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవానీలు ఎంపికైనట్లు సంయుక్త కలెక్టర్ ప్రకటించి.. వారికి ధ్రువపత్రాలను అందించారు.

==========================

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 7 నెలలలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో ఈరోజు శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రానున్న రోజుల్లో 20 లక్షల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని.. పట్టభద్రుల ఎన్నికలకు అందరూ సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

విరామం

==========================

బాలికల భవిష్యత్ కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. పెనుమంట్ర మండలం మార్టేరు - నెగ్గిపూడి గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఉన్నత పాఠశాలలో ఈరోజు "ఝాన్సీ

లక్ష్మీబాయి ఆత్మరక్షణ" కార్యక్రమాన్ని కలెక్టరు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షన్ శిక్షణ కార్యక్రమాలు జిల్లాలో ఈ రోజు నుండి మార్చి 15వ తేదీ వరకు జరుగుతాయన్నారు. దీనికోసం 50 మంది కరాటే ఉపాధ్యాయులను కేటాయించామన్నారు.

==========================

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 7 గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎనిమిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈ రోజు నుంచి మార్చి 2వ తేదీ వరకు నమోదు చేయవచ్చని తెలిపింది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య, వసతితో పాటు జాతీయ స్థాయిలో నిర్వహించే పలు ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు అధికారులు తెలియజేశారు.

==========================

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి నారాయణ ఆకాశవాణి విశాఖపట్నం కేంద్ర ప్రాంతీయ వార్తా విభాగానికి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

తిరుమలలో రథసప్తమి వేడుకలకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం సూర్యప్రభ వాహనసేవతో వేడుకలు ప్రారంభమవ్వనుండగా రాత్రి చంద్రప్రభ వాహనసేవతో వేడుకలు ముగియనున్నాయి. గ్యాలరీల్లో 2 లక్షల మంది భక్తులకు అనుమతించనున్నారు. రథసప్తమి సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనాల కోసం సిఫారసు లేఖలు అనుమతించబడవని.. కేవలం సర్వదర్శనం మాత్రమే ఉంటుందని టీటీడీ కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు. అష్టాదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలు రద్దు చేసినట్టు టీటీడీ అధికారులు తెలియజేశారు.

==========================

మద్యం సేవించి వాహనం నడపరాదని పార్వతీపురం మన్యం జిల్లా రవాణా శాఖాధికారి టి. దుర్గా ప్రసాద్ రెడ్డి అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఈరోజు పార్వతీపురంలో విద్యార్థులకు రహదారి ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ద్విచక్ర వాహనాన్ని నడిపే వ్యక్తి తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించడం చట్టరీత్యా నేరమని, అందుకు భారీ జరిమానాతో పాటు 3 నెలలు డ్రైవింగ్ లైసెన్స్ కేన్సిల్ చేసే అవకాశం ఉందన్నారు. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు.

==========================

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అంశాలపై కేంద్ర హోం శాఖ కార్యాలయంలో ఈరోజు కీలక సమావేశం జరిగింది. హోంశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఇతర అధికారులు హాజరయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య అపరిష్కృత అంశాలు విభజన చట్టం ప్రకారం కేంద్రం నుంచి రావాల్సిన నిధులపైనా ఈ సమావేశంలో చర్చించినట్లు అధికారులు పేర్కొన్నారు.

==========================
==========================